AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

23-4-2026 (Thursday) MAIN EDITION

## ఎల్లుండి కవిత కొత్త పార్టీ.. పేరు అదేనా..!



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ నెల 25న కొత్త పార్టీని ప్రకటించనున్నారు. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరిట పార్టీ పేరు కోసం ఆమె దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన తర్వాత కవిత సొంత పార్టీ ఏర్పాటు కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మేరకు తొలుత జాగృతిని బలోపేతం చేశారు. తన తండ్రి పేరు లేకుండానే సొంతంగా జనంలోకి వెళ్లారు. ఈ క్రమంలో తాజాగా కొత్త పార్టీ ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారులు, అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్తామని ఆమె ప్రకటించారు.

## బ్యాంకులో స్పెషలిస్ట్ ఆఫీసర్ కొలువులు

**అక్షరటుడే, ఎడ్యుకేషన్‌డెస్క్:** ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన ఇండియన్ బ్యాంక్ కొలువుల భర్తీకి చర్యలు చేపట్టింది. 350 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం 350 పోస్టులు భర్తీ చేయనుంది. ఐటీ, క్రెడిట్, ఫైనాన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్, ట్రెజరీ, వెల్త్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, సెక్యూరిటీ, సివిల్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ వంటి విభాగాల్లో ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఏప్రిల్ 28 వరకు దరఖాస్తు గడువు ఉంది. ముందుగా ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. తర్వాత ఇంటర్వ్యూ ఉంటుంది. చివరగా డాక్యుమెంట్ వెరిఫికేషన్. మెడికల్ పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

### తమిళనాడు, బెంగాల్‌లో పోలింగ్

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు, పశ్చిమ బెంగాల్‌లో తొలి విడత 152 స్థానాలకు పోలింగ్ సాగుతోంది. ఇందుకు కోసం కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. తమిళనాడులో మధ్యాహ్న ఒంటి గంట వరకు 56.81 శాతం, బెంగాల్‌లో 62.18 శాతం పోలింగ్ జరిగింది.




### రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ ఆగ్రహం

**అక్షరటుడే,హైదరాబాద్:** తెలంగాణలోని ఆర్టీసీ కార్మికుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో వాగ్దానాలు చేసిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కిందని విమర్శించింది.



### ఏపీ హైకోర్టు సీజేగా జస్టిస్ లిసా గిల్

**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ నియమితులయ్యారు. ఇందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో కేంద్ర న్యాయశాఖ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 25న జస్టిస్ లిసా గిల్ సీజేగా ప్రమాణం చేయనున్నారు.



## విచారణకు రాలేనన్న మోనాలిసా..!



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కుంభ మేళాలో పూసలు అమ్ముతూ సోషల్ మీడియాలో ఫేమస్ అయిన మోనాలిసా కేరళకు చెందిన ఫర్మాన్ ఖాన్‌ను ప్రేమించి మార్చి 11న వివాహం చేసుకుంది. అయితే, ఆమె వయసుపై వివాదం తలెత్తడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రి రికార్డుల ప్రకారం వివాహం నాటికి మోనాలిసా వయసు కేవలం 16 ఏళ్లు మాత్రమేనని తేలడంతో, మైనర్‌ను పెళ్లాడినందుకు ఫర్మాన్‌పై పోక్సో కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా మధ్యప్రదేశ్ పోలీసులు మోనాలిసాను వ్యక్తిగతంగా హాజరుకావాలని కోరారు. ప్రస్తుతం ఆమె కేరళలో ఉండగా, ఆమె ఆరోగ్య పరిస్థితి రీత్యా ప్రయాణం చేయలేదని ఫర్మాన్ పోలీసులకు తెలియజేశారు.

## నల్లాకు మోటార్ల బిగింపుపై అధికారుల చర్యలు

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో అనేక ప్రాంతాల్లో నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నల్లాల ద్వారా సరిపోయేంత నీరు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. నల్లాలకు అక్రమంగా మోటార్లతో నీటిని తోడుతున్న వారిపై అధికారులు దాడులు చేపడుతున్నారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో తెల్లవారు జామున 4 గంటల అధికారులు దాడులు చేశారు. పైపులైనుకు అక్రమంగా బిగించిన 17 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు.

# ఇంధన ధరలు పెంచబోం

- ఎన్నికల తర్వాత రేట్లు పెరుగుతాయని ప్రచారం
- క్లారిటీ ఇచ్చిన కేంద్రం
- రేట్లు పెంచబోమని ప్రకటన

**ఇంధన ధరలు పెరుగుతాయని ఇటీవల ప్రచారం జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై తాజాగా కేంద్రం క్లారిటీ ఇచ్చింది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయనే ప్రచారంలో వాస్తవం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ పేర్కొంది. ప్రభుత్వం అటువంటి నిర్ణయం ఏదీ తీసుకోలేదని స్పష్టం చేసింది. పుకార్లను నమ్మి ఆందోళన చెందొద్దని కోరింది.**

**–అక్షరటుడే, నేషనల్‌డెస్క్**




పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హర్మూజ్ జలసంధి మూసివేతతో కొన్నిరోజులుగా ముడి చమురు ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. దీంతో అనేక దేశాలు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచాయి. భారత ప్రజలపై భారం మోపలేదు. పవర్ పెట్రోల్ రేట్లను మాత్రం స్వల్పంగా పెంచింది. సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలను అలాగే ఉంచింది. ఇటీవల అస్సాం, కేరళ, పుదుచ్చేరిలో ఎన్నికలు ముగిశాయి. నేడు తమిళనాడు ఎన్నికలు జరుగుతున్నాయి. పశ్చిమ బెంగాల్ తొలి విడత పోలింగ్ గురువారం జరుగుతుండగా.. ఏప్రిల్ 29న రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి.

### ఎన్నికల తర్వాత..

ఎన్నికల నేపథ్యంతో కేంద్రం ఇన్ని రోజులు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని పలువురు భావించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు పూర్తి కాగానే రేట్లు పెరుగుతాయని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. లీటరుకు రూ. 25 నుంచి రూ. 28 వరకు పెరగనున్నాయని ప్రచారం జరగడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురి అయ్యారు. ఈ ప్రచారంపై తాజాగా కేంద్రం స్పందించింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని కొట్టిపారేసింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. కాగా 'కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్' ఇచ్చిన ఒక నివేదిక ఆధారంగా ఈ ప్రచారం జరిగింది. క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 120 డాలర్ల సమీపంలో ఉండటంతో ఎన్నికల తర్వాత భారత్‌లో ఇంధన ధరలు పెరుగుతాయని ఆ నివేదిక అంచనా వేసింది.

### ధరలు పెంచని ఏకైక దేశం భారత్

గత నాలుగేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచకుండా స్థిరంగా ఉంచిన ఏకైక దేశం భారత్ మాత్రమేనని పెట్రోలియం శాఖ గుర్తు చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో రేట్లు పెరిగినప్పటికీ, దేశంలోని పౌరులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వెల్లడించింది.

### పుకార్లను నమ్మవద్దు

ముడిచమురు దిగుమతి వ్యయాలు పెరిగినా, ధరల భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తోందని పేర్కొంది. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని, ఇంధన ధరల విషయంలో ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటుందని ట్వీట్ చేసింది. ప్రస్తుతానికి ధరల పెంపు ఆలోచనే లేదని చెప్పడంతో సామాన్య, మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఉపశమనం లభించినట్లయింది.



### గ్లామర్ ఇమేజ్ బ్రేక్ చేయనున్న డింపుల్..?

**టాలీవుడ్‌లో గ్లామర్ రోల్స్‌తో గుర్తింపు పొందిన హీరోయిన్ డింపుల్ హయాతి. ఈ బ్యూటీ ఇప్పుడు కెరీర్‌లో కీలక మలుపు దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటివరకు ప్రధానంగా గ్లామర్‌కు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లోనే కనిపించింది. అయితే తాజాగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల వైపు మళ్లుతున్నట్లు వస్తున్న వార్తలు ఆసక్తి కలిగిస్తున్నాయి. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తదుపరి సినిమాలో విలన్ తరహా పాత్ర కోసం ఆమె పేరు వినిపిస్తోంది. డైరెక్టర్ కేఎస్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ దశలో ఉండగానే, డింపుల్ పాత్రపై ఇండస్ట్రీలో చర్చ మొదలవడం ఆమె కెరీర్‌లో ఇది టర్నింగ్ పాయింట్ కావొచ్చన్న సంకేతాలను ఇస్తోంది.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**


## ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన భగీరథ జయంతిలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ సమ్మె బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల సామూహిక వైఫల్యాన్ని ప్రతిబింబించే విషయమన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఈ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, ప్రస్తుత కాంగ్రెస్ సైతం అదే మొండి వైఖరి, నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు ఆర్టీసీ ఉద్యోగులకు బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. దీంతో నేడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

## ఉత్తర తెలంగాణకు రెడ్ అలెర్ట్

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో మళ్లీ ఎండలు దంచి కొడుతున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో కాస్త చల్లబడిన వాతావరణం.. మళ్లీ వేడెక్కింది. గురువారం నుంచి ఎండ తీవ్రత పెరగనుంది. అయితే శుక్రవారం నుంచి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలో రేపటి నుంచి హీట్‌వేవ్ మొదలు కానుంది. ఏప్రిల్ 2429 వరకు భానుడు భగభగ మండుతాడు. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరే అవకాశం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, గద్వాల, వనపర్తి జిల్లాల్లో 43 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. దీంతో ఆ జిల్లాలకు అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. మిగతా జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల మధ్య టెంపరేచర్ రికార్డు అయ్యే ఛాన్స్ ఉంది.




## భారత్‌ను నరకంతో పోలుస్తూ ట్రంప్ పోస్ట్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. దేశాన్ని నరకంతో పోలుస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వలసల విషయంలో భారత్‌పై మరోసారి విద్వేషం బయటపెట్టిన ట్రంప్‌పై విమర్శలు వస్తున్నాయి. అమెరికాలో పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ ట్రంప్ పోస్ట్ చేశారు. భారత్, చైనా, ఇతర దేశాలను "నరక కూపాలు"గా పేర్కొన్నారు. విదేశీయుల పిల్లలు మొదట అమెరికా పౌరులుగా మారతారని.. ఆ తర్వాత వారు తమ కుటుంబాలు మొత్తాన్ని చైనా, భారత్ లేదా మరేదైనా నరకం నుంచి ఇక్కడికి తీసుకొస్తారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.



## బిర్యానీ సెంటర్‌ను సీజ్ చేసిన అధికారులు



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** హైదరాబాద్ నగరంలో ఆహార కల్తీ ఆగడం లేదు. అనేక పదార్థాలను కల్తీ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మరోవైపు హోటళ్లలో నాసిరకం సరుకులతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడుల్లో ఎంతో మంది అరెస్ట్ అవుతున్నారు. అయినా కల్తీ మాఫియా దందా ఆపడం లేదు. తాజాగా ఎస్‌వోటీ పోలీసులు ఓ బిర్యానీ సెంటర్‌పై దాడి చేశారు. కూకట్‌పల్లిలోని నసీబ్ బిర్యానీ సెంటర్‌లో పోలీసులు సోదాలు చేశారు. అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితుల మధ్య వంట చేస్తున్నట్లు గుర్తించారు. పెద్ద మొత్తంలో వేయించిన ఉల్లిపాయలను తయారు చేయడానికి, ఆ వంటగదిలో వాడిన వంట నూనెను యథాలాపంగా సేకరించి తిరిగి వాడుతున్నట్లు ఇన్‌స్పెక్టర్లు కనుగొన్నారు. కలుషితమైన ఆహార పదార్థాలు ప్రజలకు అందించకుండా అధికారులు సుమారు 1,000 కిలోల పచ్చి ఉల్లిపాయలను, 70 కిలోల వేయించిన ఉల్లిపాయలను ధ్వంసం చేశారు.

## మెగా సోలార్ ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన



**అక్షరటుడే, ఏపీ:** రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లా రాంబిల్లి సెజ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా 'రెన్యూ ఎనర్జీ గ్లోబల్' సంస్థ ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్‌కు ఆయన భూమి పూజ చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్ర పారిశ్రామిక రూపురేఖలు మారనున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ మొత్తం రూ.5,400 కోట్లను ఇక్కడ పెట్టుబడిగా పెట్టనుంది. దీనిని రెండు విభాగాలుగా నిర్మించనున్నారు. రూ.4,200 కోట్లతో 6.5 గిగావాట్ల సామర్థ్యం కలిగిన దేశంలోనే తొలి సమగ్ర (ఇంటిగ్రేటెడ్) సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. రూ.1,200 కోట్లతో 125 మెగావాట్ల సామర్థ్యం గల హైబ్రిడ్ ప్రాజెక్టును నిర్మించనున్నారు.

## సమ్మె ఎఫెక్ట్.. ఒక్కరోజే రూ.17 కోట్లకు పైగా నష్టం!



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్త ఆర్టీసీ సమ్మె కారణంగా సంస్థ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. సమ్మె కారణంగా నిన్న ఒక్కరోజే ఆర్టీసీకి రూ. 17 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. సాధారణ రోజుల్లో కోట్లల్లో వచ్చే ఆదాయం, సమ్మె ప్రభావంతో లక్షలకు పడిపోయింది. సాధారణంగా రాష్ట్ర వ్యాప్తంగా టిక్కెట్ల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంతో పోలిస్తే, నిన్న కేవలం రూ. 3.22 కోట్లు మాత్రమే వసూలైనట్లు అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా వరంగల్ వంటి పెద్ద రీజియన్లలో ప్రతిరోజూ రూ.2 కోట్లకు పైగా ఆదాయం రావాల్సి ఉండగా, నిన్నటి వసూళ్లు కేవలం కొన్ని లక్షలకే పరిమితమయ్యాయి. ఆదాయం రాకపోగా, నిర్వహణ ఖర్చులు భారం కావడంతో సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.